క్లుప్తంగా

బాలుకు జ్యోతీరావ్ పూలే ఎక్స్‌లెన్స్ అవార్డు



బాలుకు పూలే ఎక్స్‌లెన్స్ అవార్డును అందజేస్తున్న డీఈఓ తదితరులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలో పెన్నలపాడు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు, కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు బాలసుబ్రమణ్యంకు పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆదివారం తిరుపతి దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ప్రాంగణంలో జ్యోతీరావ్ పూలే ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రదానం చేసింది. ఉత్తమ విద్యాబోధన, సాహిత్యం, కళలు, సామాజిక సేవలకు ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేసినట్లు ఫెడరేషన్ నిర్వాహకులు తెలియచేశారు. ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, ఉభయ తెలుగు రాష్ట్రాల మాజీ జడ్జి చంద్రకుమార్, సీనియర్ పాత్రికేయులు, కవి ఇంద్రవెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



శ్రీహరిరావు

రేణిగుంట: ప్రపంచ ఎన్ఆర్ఐ సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా బి.శ్రీహరిరావు నియమితులయ్యారు. 31ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా అనేక సామాజిక, శాంతిస్థాపన కార్యక్రమాలు నిర్వహించిన ఈ అసోసియేషన్‌లో తనకు జాతీయస్థాయిలో పదవి దక్కడం ఆనందంగా ఉందని, తాను సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు శ్రీహరిరావు తెలిపారు.

ఆమ్ ఆద్మీ పార్టీ మండల కన్వీనర్‌గా..

బుచ్చినాయుడుకండ్రిగ: ఆమ్ ఆద్మీ పార్టీ మండల కన్వీనర్‌గా కుంచాల రవిచంద్ర, కో–కన్వీనర్‌గా అనిల్‌ను నియమించినట్టు సత్యవేడు నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ ఎంటెక్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని కొత్త నియమితులైన రవిచంద్ర, అనిల్ తెలిపారు.

విద్యార్థులకు బియ్యం పంపిణీ



విద్యార్థులకు బియ్యం అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లె ఎస్టీ కాలనీలో ఆదివారం యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులకు బియ్యాన్ని పంపిణీ చేశారు. యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్, జస్వంత్, హనుమంతు నాయక్, వినోద్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో ఎంజీఎం విద్యార్థిని ప్రతిభ



శ్రావ్యను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

శ్రీకాళహస్తి: వ్యాసరచన పోటీలో ఎంజీఎం 9వ తరగతి విద్యార్థిని శ్రావ్య ప్రతిభ చూపింది. తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్‌లో ఇటీవల ఈ పోటీలు నిర్వహించారు. ఉమెన్ ఇన్ సైన్స్ ప్రోగ్రాంలో సీనియర్ విభాగంలో మొదటి స్థానం శ్రావ్య సాధించింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఎంజీఎం గ్రూప్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్, ప్రధానోపాధ్యాయులు మునిరత్నంనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

కారు–ఆటో ఢీ : ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కారు, ఆటో

ఏర్పేడు: కారు..ఆటోను ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం మండలంలోని జంగాలపల్లె వద్ద చోటుచేసుకుంది. ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన బిశాల్‌కుమార్ (26), జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నివేష్ గుప్త(24) జంగాలపల్లె వద్ద ఉన్న ఐసర్‌లో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. ఆదివారం ఇద్దరూ ఏర్పేడుకు వచ్చిన ఆటోలో ప్రయాణమయ్యారు. జంగాలపల్లె వద్ద రోడ్డు దాటుతుండగా వెంకటగిరి నుంచి ఏర్పేడుకు వెళుతున్న కారు వేగంగా ఢీకొంది. ఆటో, కారు ముందరి భాగాలు ధ్వంసమయ్యాయి. గాయపడిన బిశాల్, నివేష్‌ను తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ అంజనిమిశ్రా, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమేష్ భార్గవ్ దర్శించుకున్నారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

జలపాత ఝరి.. పర్యాటకుల ఆనందకేళి



సద్దికూడు మడుగు జలపాతంలో స్నానమాచరిస్తున్న పర్యాటకులు



నాగలాపురం మండలం జంబుకేశ్వపురం వద్ద ఉన్న సద్దికూడు మడుగు జలపాతం

- పర్యాటకులను ఆకట్టుకుంటున్న సద్దికూడు మడుగు జలపాతం
- శని, ఆదివారాల్లో పోటెత్తుతున్న పర్యాటకులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం జంబుకేశ్వరపురం వద్ద ఉన్న సద్దికూడు మడుగు జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఎత్తైన కొండల మధ్య నుంచి దుముకుతున్న జలపాతం సవ్వడి నడుమ ఇక్కడి మడుగులో కేరింతలు కొట్టడం పర్యాటకులకు ఎనలేని ఉత్సాహాన్ని ఇస్తోంది. వేసవి కావడంతో మన రాష్ట్రంతో పాటు తమిళనాడు నుంచి పర్యాటకులు వస్తుంటారు. జలపాతంలో స్నానమాచరించి, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుంటారు. శని, ఆదివారాల్లో పర్యాటకుల తాకిడి ఇక్కడ ఎక్కువ. కొండలు, గుట్టల నడుమ ఉన్న వనమూలికలను స్పృశిస్తూ మడుగుకు చేసే ఈ నీటిలో స్నానం ఆచరించడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని పర్యాటకుల నమ్మకం. మడుగులోని నీరు ఇక్కడి కొలువుదీరిన శివలింగాన్ని ప్రణమిల్లుతున్నట్లు ఉండడం విశేషం. ఇక్కడికి వచ్చే పర్యాటకులు శివునికి పూజలు చేసి మొక్కులు చెల్లించటం ఆనవాయితీ. ఇక్కడికి వచ్చే తమిళనాడు వాసులు ఎక్కువగా ఇక్కడ ఉన్న కొండలపై ట్రెక్కింగ్ చేయడానికి ఆసక్తిని చూపుతుంటారు. ఈ జలపాతానికి చేరుకోవాలంటే తిరుపతి– చెన్నై (వయా ఊత్తుకోట) జాతీయ రహదారిలోని రెండు పట్టణాలకు మధ్యలో (70 కిలోమీటర్ల దూరంలో) ఉన్న నాగలాపురం చేరుకోవాలి. అక్కడ నుండి టీపీ కోట మార్గంలో 10 కిలోమీటర్ల దూరంలో జంబుకేశ్వపురం అనే గ్రామం సమీపంలో జలపాతం ఉంది. ఇక్కడికి కార్లు, టూవీలర్లలో చేరుకోవచ్చు. శని, ఆదివారాల్లో 200 పైచిలుకు పర్యాటకులు వస్తుంటారు.



మడుగు వద్ద పూజలందుకుంటున్న శివలింగం, ట్రెక్కింగ్ చేస్తున్న తమిళనాడు యువత (ఫైల్)

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం



విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఎస్పీ తదితరులు

శ్రీకాళహస్తి: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం పొందవచ్చని శ్రీకాళహస్తి డీఎస్పీ విశ్వనాథ్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడోత్సవాల్లో భాగంగా ఇంట్రామురల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. విజేతలకు ముఖ్యఅతిథిగా డీఎస్పీ, మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేసి మాట్లాడారు. ఆరోగ్యకరంగా ఉండడంతోపాటు చదువుల్లో చురుగ్గా ఉండాలంటే విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, స్కూల్ కమిటీ చైర్మన్ ఆర్కాడు శంకర్, మహిళా డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావు, బహుమతి ప్రధాన దాతలు జూటూరు డిజిటల్స్ అధినేత రాధేశ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లంలో స్థానిక యువత బీవీఎం ప్రీమియర్ లీగ్ పేరిట ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. వరదయ్యపాళెం, తడ, సూళ్లూరుపేట మండలాలతో పాటు తమిళనాడు నుంచి మొత్తం 28 జట్ల నుంచి ఎంట్రీలు అందాయి. ఎస్ఐ మాట్లాడుతూ, క్రీడాకారులు గెలుపోటములను సమానంగా క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. వరుసగా 4 ఆదివారాలు మాత్రమే టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు 6 జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్ రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, సర్పంచ్ దుడ్డు వేణు, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ అబ్దుల్, మహేష్, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టైర్ పేలి లగేజీ జీపును ఢీకొన్న లారీ



బోల్తా పడిన లగేజి జీపు

నారాయణవనం: లగేజీ జీపును లారీ ఢీకొనడంతో జీపు డ్రైవర్ గాయపడిన సంఘటన ఆదివారం ఉదయం సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం..పుత్తూరుకు చెందిన టమాటాల వ్యాపారి మహమ్మద్(36) తన లగేజి జీపుతో ఆదివారం ఉదయం బయలుదేరాడు. సిద్దార్థ కళాశాల సమీపంలోని హోటల్‌లో టిఫిన్ తిని తన వాహనాన్ని ఎక్కాడు. అదే సమయంలో కోడూరు నుంచి చెన్నై హార్బర్‌కు వెళుతున్న ట్రైలర్ లారీ ముందు టైర్ పేలడంతో అదుపు తప్పి జీపును వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ ముందరి భాగం దెబ్బతింది. జీపు రోడ్డుకు పక్కకు దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జీపు డ్రైవర్ మహమ్మద్ నుదుటికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. జీపు డ్రైవర్‌ను పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్, క్లీనర్ పారిపోయారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు.

సెల్ఫీల సుధీర్ రెడ్డీ .. ఇటు చూడవయ్యా!



తారకరామానగర్‌లో తాగునీటి కొళాయిలను ప్రారంభిస్తున్న మన్యం శ్రీనివాసులురెడ్డి

- దత్తత గ్రామంలో సమస్యల్ని గాలికొదిలేసిన 'బొజ్జల'
- యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ల ఏర్పాట్లతో సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే
- గొంతు తడిసి పులకించిన తారక రామానగర్
- దాహార్తి తీర్చారని సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు ప్రజల పాలాభిషేకం

రేణిగుంట: అభివృద్ధి శూన్యమంటూ సెల్ఫీలు పెడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డీ.. మీ తండ్రి దత్తత తీసుకున్న తారకరామానగర్ ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు ఇచ్చిన పాపానపోలేదని తెలియదా? అని వైఎస్సార్ సీపీ నాయకుడు మన్యం శ్రీనివాసులురెడ్డి(ఎంఎస్ఆర్) సూటిగా ప్రశ్నించారు. ఎమ్మెల్యే చొరవతో మండలంలోని కరకంబాడి తారకరామానగర్ దాహార్తి తీరిందని ఆయన చెప్పారు. గతంలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తారకరామానగర్‌ను దత్తతకు తీసుకున్నా సమస్యలను పట్టించుకోలేదని, వేసవిలో తమకు తాగునీటి సమస్య ఉందని, నీళ్లివ్వాలని రెండు రోజుల కిందట స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు నివేదించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. ఆయన ఆదేశాలతో మన్యం శ్రీనివాసులురెడ్డి పంచాయతీ అధికారుల సమన్వయంతో తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేయించారు. ఆదివారం కొళాయిల్లో నీటి సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చారు. దీనిపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కన్నయ్య, రాజేష్‌రాయల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భాష్యకారుల ఉత్సవాలు ప్రారంభం



గ్రామోత్సవంలో భాష్యకారులు

నారాయణవనం: పది రోజుల పాటు నిర్వహించే భాష్యకారుల ఉత్సవాలు ఆదివారం పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరసామి ఆలయంలో వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం భాష్యకారులు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తుల నుండి హారతులు అందుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య మాట్లాడుతూ, విశిష్టాద్వైతాన్ని వ్యాప్తిలోకి తెచ్చి వైష్ణవదాసుల కైంకర్యం చేసే సాంప్రదాయాలను ప్రచారంలోకి తీసుకువచ్చిన వారిలో భాష్యకారులు ప్రముఖులని అన్నారు. తొలి తొమ్మిది రోజుల పాటు భాష్యకారుల ఊరేగింపు, చివరి రోజు ఉభయ నాంచారుల సమేతుడైన కల్యాణ వెంకటేశరస్వామితో భాష్యకారుల ఊరేగింపు, కొలువు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించండి

రేణిగుంట: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా రైల్వే కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ జయంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో రైల్వే వ్యవస్థ ఏర్పడి 170 ఏళ్లు అయ్యాయని, ప్రస్తుతం దేశంలోనే 18 రైల్వే జోన్ల పరిధిలో 13లక్షల మంది రైల్వే పెన్షనర్లు ఉన్నారని, వారందరికీ ఇళ్ల వద్దకే మందులను పంపిణీ చేయాలన్నారు. రైల్వే ప్రైవేటీకరణకు స్వస్తి పలికి ఖాళీగా ఉన్న 3లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆయన కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

మా మద్దతు వైఎస్సార్ సీపీకే..



కనమనంబేడు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం

బుచ్చినాయుడుకండ్రిగ: 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే తమ మద్దతు ఇస్తామని కనమనంబేడు ప్రజలు తేల్చిచెప్పారు. ఆదివారం కనమనంబేడు గ్రామపంచాయతీ గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. జగనన్న స్టిక్కర్లను ఇళ్లకు అతికించి, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుచ్చినాయుడుకండ్రిగ సింగిల్ విండో చైర్మన్ పల్లం పర్తి హరనాథరెడ్డి, సురుటుపల్లి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు అంబటిఅజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ జనార్దన్, మాజీ సర్పంచ్ విజయ్‌భాస్కర్, నాయకులు దశకుమార్, వెంకటాద్రి, గంగయ్య, మాధవయ్య పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మ కొలుపు



విశేషాలంకరణలో అంకమ్మ

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఆదివారం అంకమ్మ కొలుపు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పలు రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేశారు. ఆలయంలో భక్తిప్రపత్తులతో హోమం చేశారు. అంకమ్మ, గంగమ్మ, మారెమ్మ ముగ్గులను వేసి పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు ప్రతి ఏటా అంకమ్మ కొలుపు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పల్లంపేటలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో వంద మందికి పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాలకు చెందిన వెంకటాద్రి, వెంకటేశ్వర్లు నాయుడు, రఘురామ నాయుడు, చెంచయ్య నాయుడు, వెంకీ నాయుడు, దాము, వెంకటేశ్వర్లు, పెంచలయ్య, భాస్కర్, మస్తాన్ బాషా తదితర వంద మందికిపైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, సర్పంచ్ గోపాల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, మాజీ ఎంపీటీసీ రమణయ్య యాదవ్, కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, గోవర్ధన్‌రెడ్డి, లోకనాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని సీనియర్ లీడింగ్ ఫైర్‌మెన్ నాగార్జునరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం చెంచులక్ష్మికాలనీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్యాస్ లీక్ అయినపుడు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఆ ప్రమాదాలను ఎలా నివారించి బైటపడాలో ప్రజలకు వివరించారు. వారి చేత ప్రదర్శనపూర్వకంగా చేయించారు. అలాగే ఈటీసీ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న వలంటీర్లు, ఆశా వర్కర్లకు కూడా ఆపదలో ఉన్నవారిని ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి? అనే విషయంపై ప్రదర్శనపూర్వకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉయ్యాలసేవ



శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు, ఉయ్యాలసేవలో భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి శ్రీప్రసన్న వేంకటేశ్వస్వామి ఉత్సవమూర్తిని ఊరేగించి, ఉయ్యాల సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తొలుత వేంకటేశ్వరస్వామి విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను పూలతో అలంకరించి పూజలు చేసి, భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఆవులకు గోపూజ చేశారు. భక్తులకు పులిహోర, దద్ధోజనం, పంచామృతం ప్రసాదాలను అందజేశారు.

వృద్ధులకు సరుకులు, రంజాన్ తోఫా



వికలాంగులు, వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్ రమణారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలో నగరివీధిలోని హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులు, వికలాంగులకు నిత్యావసర సరుకులు, రంజాన్‌తోఫా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ, ప్రతి నెలా ఇలా పేదలకు సంస్థ సేవ చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు మునీర్‌బాషా, సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, రాజేశ్వరరావు, బాబా ఫరీద్, సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతో సామాజిక సేవ



మాట్లాడుతున్న ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు

బుచ్చినాయుడుకండ్రిగ: 40 ఏళ్లుగా ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, బీఎస్‌కండ్రిగ మండలాల్లో అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశామని ప్రజాప్రగతి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలో ప్రజాప్రగతి ట్రస్ట్ కార్యాలయంలో 40 వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని, ప్రధానంగా గిరిజన కాలనీలలో విద్యకు సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణన్, గోపికృష్ణ, బీజీ నాయుడు, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు రాజారెడ్డి, ట్రస్ట్ కో- చైర్మన్ సుధీర్, కో–ఆర్డినేటర్ల సుస్మిత, శ్రీనివాసులునాయుడు, చంద్రశేఖర్, సుబ్రమణ్యం, దేవేంద్రకుమార్, బాలాజీనాయక్, సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.